క్లుప్తంగా

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



మరికల్: రాష్ట్ర టీఎమ్మార్పీఎస్ కార్యదర్శిగా ఎంపికైన జోగురామస్వామిని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏబీసీడీ వర్గీకరణ అమలు కోసం క్షేత్రస్థాయిల్లో ఎమ్మార్పీఎస్ నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బసంత్, జగదీష్, నారాయణ, కృష్ణయ్య, రాములు, రాయుడు, రాజారెడ్డి, కుర్మయ్య, బాలకృష్ణ, మాసప్ప, రవిగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు రుసుంను తగ్గించాలని డీఎడ్, బీఎడ్ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఒక్కో పేపర్‌కు రూ.300 చొప్పున ఉంటే ప్రస్తుతం రూ.వెయ్యికి పెంచడం దారుణమని విమర్శించారు. నిరుద్యోగుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేయాలని అనుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, వెంటనే గతంలో మాదిరి పరీక్షఫీజును తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతీ జిల్లా కేంద్రంలో పరీక్ష సెంటర్‌లను ఏర్పాటుచేయాలన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిగ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులు వేశాధారణతో స్వయంపాలన దినోత్సవంలో పాల్గొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీచర్‌లు రాజేశ్వరి, రామేశ్వరి పాల్గొన్నారు.

తాటి నర్సప్ప మృతి తీరనిలోటు

నారాయణపేట రూరల్ : ప్రముఖ చిత్రకారుడు తాటి నర్సప్ప మృతి కళారంగానికి తీరని లోటని ఎస్పీ బాలుఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం సంతాపం వ్యక్తం చేశారు. నాడు రాష్ట్రస్థాయిలో ఛాయాచిత్రాలను గీసి ప్రజలను చైతన్యపర్చిన కళాకారుడిగా గుర్తింపు సంపాదించాడన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు



మద్దూర్‌లో మద్యంబాటిళ్లు పట్టుకున్న పోలీసులు

కోస్గి: పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులపై శుక్రవారం పోలీసులు దాడిచేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని కడంపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ దుకాణంపై దాడి చేయగా 12.52 లీటర్ల మద్యం పట్టుబడిందని, సంబంధిత దుకాణ యజమాని చెన్నయ్యపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాంలాల్ కథనం మేరకు నాగిరెడ్డిపల్లికి చెందిన గోపాల్‌గౌడ్ ఆటో అక్రమంగా 47.22 లీటర్ల మద్యాన్ని మద్దూరునుంచి తన స్వగ్రామానికి తరలిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌పోలీసులు పట్టుకున్నారు. ఈ మద్యం విలువ రూ. 25వేల 422 రూపాయాలు ఉంటుందని తెలిపారు. మద్యాన్ని సీజ్‌చేసి గోపాల్‌గౌడ్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీమోర్చ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో వచ్చేనెలలో నిర్వహిస్తున్న ఎస్సీమోర్చ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దామని ఆ సంఘం రాష్ట్రఅధికార ప్రతినిధి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం పూర్తిగా జిల్లా కేంద్రానికి వస్తున్నారని, పెద్ద ఎత్తున సమ్మేళనానికి తరలివచ్చి దళితుల సత్తా చాటుకుందామన్నారు. సమావేశంలో గోపాల్, ఆశప్ప, సైదప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికోసం ఎస్‌డీఎఫ్ నిధులు

- మండలంలోని 49గ్రామాల్లో 47 పనులకుగాను కోటి 13లక్షల 70 వేలు
- ఇప్పటికే 24 గ్రామాల్లో పనులు పూర్తి
- త్వరలో మిగితా గ్రామాల్లో పనులు ప్రారంభం



మద్దూరులోని జీపీ వద్ద బోరు మోటారును పరిశీలిస్తున్న డీపీఓ అనిత (ఫైల్)



మద్దూరులోని బడేసాబ్‌దర్గ వద్ద మోటార్ దింపుతున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

మద్దూరు: వేసవి కాలంలో ఉమ్మడి మద్దూరు మండలంలోని తాగునీటి సమస్య నెలకొన్న గ్రామాల్లో కాలనీలో వెంటనే పరిష్కరించడానికి (ఎస్‌డీఎఫ్) నిధులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఎన్నికల కోడ్ రాకముందే ఉమ్మడి మండలంలోని 49గ్రామాల్లో 47పనులకు గాను కోటి 13లక్షల 70వేల రూపాయాల నిధులు మంజూరైయ్యాయి. ఇందులో కొత్తపల్లి మండలంలో 17పనులు, మద్దూరు మండలంలో 30పనులగాను ఈ నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

తాగునీటి అవసరాల కోసం..

ఈ నిధులు గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న బోరుబావుల్లో మోటార్లు దించడం, బోరు బావులను ఫ్లెసింగ్ చేయించడం, తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటే బోరువేసి మోటారు బిగించడం, మిషన్ భగీరథ నీరు అందని కాలనీలకు పైప్‌లైన్, గేట్ వాల్వులు రిపేరు, నీటి ట్యాంక్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం వీటిని వినియోగిస్తున్నారు.

24గ్రామాల్లో పనులు ప్రారంభం

కొత్తపల్లి, మద్దూరు మండలాల్లో తాగునీటి అవసరాలను తీర్చడానికి బోర్లువేసి మోటార్లు బిగించడం, గేట్ వాల్వ రిపేరు తదితర పనులు ప్రారంభించారు. ఇప్పటికే దాదాపు 24గ్రామాల్లో ఈ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. మిగితా గ్రామాల్లో కూడా త్వరలో పనులు పూర్తిచేసి తాగునీటి అవసరాలు తీర్చనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల మధ్య ఆధిపత్యపోరులో పనులు చేయడంలో ఆలస్యమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం..



ఉమ్మడి మండలంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఇప్పటివరకు చాలా వరకు పనులు పూర్తిచేశాం. మరికొన్ని పనులు ఈ వారంలో ప్రారంభిస్తాం. ఏ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ కార్యర్శులతో సమీక్ష నిర్వహించాం. ఎక్కడైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

– జయరాములు, ఎంపీడీఓ, మద్దూరు

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డాక్టర్ రాజేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మక్తల్: గత 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించకపోతే ఏప్రిల్ ఒకటినుంచి నిరవధిక సమ్మెచేస్తామని సీహెచ్‌సీ పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ రాజేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. సీహెచ్‌సీలలో పని చేస్తున్న వారికి ఆరునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఏప్రిల్ ఒకటి నుంచి సమ్మెచేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి బాల్‌రాజ్, మహెబూబ్, పవన్, లక్ష్మి, నర్మద, తిప్పమ్మ పాల్గొన్నారు.

చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మహిళలు

మద్దూరు: మండలంలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక జేసీపీఎం చర్చిలో పాస్టర్ అనిల్‌కుమార్ ఏసుక్రీస్తు బోధనలు భక్తులకు వివరించారు. ఏసు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ శాంతితో జీవనం సాగించాలని సూచించారు. అలాగే మద్దూరులోని మెథడిస్టు, నాగిరెడ్డిపల్లి, దొరేపల్లి, తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

ఊట్కూరు: మండలంలోని సమస్తాపూర్ గ్రామశివారుని శ్రీ శంకరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నందికొండ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయం ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటుచేశారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాం తా లనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ మ్యాన్‌హోల్

మాగనూర్: మండల కేంద్రంలోని జాతీయరహదారికి ఇరువైపులా నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ అప్పుడే అస్తవ్యస్తంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మారుతి ఆస్పత్రి సమీపంలో గత కొన్ని రోజులుగా మ్యాన్‌హోల్ విరిగిపడిపోయి ఇళ్లకు వెళ్లే వారికి ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. డ్రెయినేజీలో మురుగు నీరు ఏటువెళ్లకపోవడంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని, ఇప్పటికైనా అధికారులు సంబంధిత స్పందించి డ్రెయినేజీని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మలుపులు



ధన్వాడ నుంచి కిష్టాపూర్ వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



నేరగడం గ్రామానికి వెళ్లేదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ధన్వాడ/మాగనూర్: మండల కేంద్రంలోని రాంకిష్టాయిపల్లి, కిష్టాపూర్, కొండాపూర్, చర్లపల్లి, హన్మన్‌పల్లి గ్రామాలకు వెళ్లేరహదారిలో పదుల సంఖ్యలో ప్రమాదకర మలుపులు ఉండటంతో ఎదురుగా వచ్చేవాహనం కన్పించక రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణికులు వెళ్లేందుకు జంకుతున్నారు. అదేవిధంగా మాగనూర్‌లోని వర్కూర్‌నుంచి నేరడగం గ్రామానికి బీడ్డుపై పలుచోట్ల మలుపు ఉండటంతో ఈ మార్గంలో గతంలో అనేక ప్రమాదాలు సంభవించిన అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పందించి మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటుచేయడంతోపాటు తగిన జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలి

ఆత్మకూర్: ప్రపంచంలో శాంతి స్థాపన కోసం ఏసుక్రీస్తు తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన చూపిన సన్మార్గంలో అందరూ పయనించాలని పాస్టర్లు సీజేజర్మీయా, డేవిడ్, విద్యాసాగర్ అన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా శుక్రవారం ఆత్మకూర్, మూలమల్ల, రేచింతల, ఖానపూర్, పిన్నంచర్ల గ్రామాల్లోని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బైబిల్ సూక్తులను వివరించారు. 40 రోజులపాటు ఆచరించిన అనంతరం క్రైస్తవులు ఏసయ్య మరణదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు.

అమరచింత: సమాజంలో జీవిస్తున్న ప్రజలందరూ ఒకరినొకరు సహాయం చేసుకోని జీవించే గుణాన్ని కలిగి ఉండాలని పాస్టర్ హ్యాపీపాల్ అన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలను నిర్విహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఏసు క్రీస్తు బోధనలు వివరించారు. అనంతరం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మస్తీపురం, నందిమళ్ల, సింగంపేట, చంద్రగఢ్, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌పీటర్, దీనకుమార్, విజయకుమార్, ప్రకాశం, ఇమ్మాన్యుయేలు, ప్రభుదాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని చేగుంట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్ఐ నవీద్‌తోపాటు కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంతోపాటు ఆ వాహనాల నంబర్లను నమోదు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణలోకి వచ్చే వాహనాల్లో మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు తరలించకుండగా పటిష్టంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు రూ. 50వేలకు పైగా నగదును తీసుకోస్తే ఆ నగదును సీజ్‌చేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా డోలహరణం



మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో కొనసాగుతున్న శ్రీ సిద్ధలింగ మహాస్వాముల మఠం జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం డోలహరణ మహోత్సవం, పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పశ్చిమాద్రి మఠాధిపతి శ్రీ సిద్ధలింగ మహాస్వాములను ఉయ్యాలలోవేసి శ్రీ సిద్ధలింగేశ్వరగా నామకరణం చేశారు. ఉదయం నుంచే భక్తులు మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి శ్రీసిద్ధలింగేశ్వర స్వామి ఆశీర్వాచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లాగౌడ్, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

నారాయణపేట రూరల్ : టీడీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఓంప్రకాష్, సూర్య, భీమన్న, వినయ్, వీరణ్ణ, యాబన్నచౌద్రి, పెంటయ్య, బోజప్పగౌడ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లిలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి మొగులప్ప, ఉపాధ్యక్షుడు వీరన్నగౌడ్, బస్వరాజ్, మహేష్, శివకుమార్, రఘు, మహాబూబ్‌అలీ తదిరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

కోస్గి: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని కడంపల్లిలో సైబర్ నేరాలు, సామాజిక అంశాలు, బాల్యవివాహాలు, దొంగతనాలపై ప్రజలకు పోలీస్ కళాబృందంచే అవగాహన ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి బ్యాంకులో ఉన్న నగదును దొంగిలిస్తారని, గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు అధికారులమంటూ, లాటరీ తగిలిందని ఆర్థిక నేరాలకు పాల్పడుతారన్నారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాలికల్ని వేదింపుల నుంచి రక్షించడమే పోలీస్ శాఖ ఏర్పాటుచేసిన షీ టీం ప్రధాన లక్ష్యమని, ఎవరైన బాలికలు వేదింపు లకు గురవుతున్న నేరుగా 1098, 100కుగాని ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్ గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గుడెబల్లూర్ గ్రామాన్ని.. సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో గ్రామంలో శుక్రవారం తాగునీటికోసం పాట్లు అనే జలగోస సాక్షిలో ప్రచురితమవడంతో ఎంపీడీఓ జానయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ పరిష్కరించారు. ఈ మేరకు.. వారు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను అడిగి నీటి ఇబ్బందులను తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని బోరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడు తూ.. ఆ గ్రామానికి అవసరమయ్యే తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొ ను న్నట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయసమీపంలో నూతనంగా బోరువేసి దాని ద్వారా మినీవాటర్ ట్యాంక్‌కు సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



మినివాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానయ్య



గుడెబల్లూర్‌లో బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానయ్య

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఊట్కూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన చిన్నపొర్ల, పెద్దపొర్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వనవాసి కల్యాణ పరిషత్ జిల్లా కమిటీ ఎన్నిక



వనవాసి కల్యాణ పరిషత్ నూతన కమిటీ

నారాయణపేట రూరల్: వనవాసి కల్యాణ పరిషత్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జయప్రకాష్, అధ్యక్షుడిగా తార్యానాయక్, ఉపాధ్యక్షుడు హన్మంతునాయక్, కార్యదర్శిగా రవినాయక్, సహాయ కార్యదర్శిగా సంతోష్‌నాయక్, కోషాధికారిగా నర్సింగ్‌నాయక్, సహ ప్రముఖ్‌గా గణేష్‌నాయక్, చికిత్స ప్రముఖ్‌గా డాక్టర్ ప్రతిభభారతి, సహప్రముఖ్‌గా నగేష్, ప్రచార కార్యదర్శిగా చంద్రశేఖర్‌నాయక్, మహిళా ప్రముఖ్‌గా కళాబాయితోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా మనోజ్, నరేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో నాయకులు, ముస్లింలు

కోస్గి: రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా శుక్రవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. పట్టణంలోని బీసీకాలనీ మజీద్ ఆవరణలో ప్రత్యేక నమాజ్ అనంతరం ముస్లింలు ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు కాంగ్రెస్ నాయకులను సన్మానించారు. టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు ఇద్రీస్, భానునాయక్, మాస్టర్ శ్రీను, అన్న కిష్టప్ప, హరి, సలీం, ఆసీఫ్, ఫెరోజ్, హాజి పాల్గొన్నారు.

శక్తిపీఠం గోశాలకు పశుగ్రాసం వితరణ



పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతు

దామరగిద్ద: జిల్లా కేంద్రంలోని సంత్‌మఠమూల మహాశక్తి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురభి గోశాలకు కాన్‌కుర్తికి చెందిన రైతుకోస్గి దానప్ప పశుగ్రాసానిన్న ప్రదానం చేశారు. గోవుల సంరక్షణకు శక్తిపీఠం గోశాలను ఏర్పాటుచేసి వాటిని సంరక్షించడం ఎంతో అభినందనీయమని తమవంతుగా పశువులకు గ్రాసాన్ని అందించి గోసేవలో భాగస్వాములైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు శక్తి పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు పశుగ్రాస దాతను అభినందించారు. కార్యక్రమంలో రైతులు, గోశాల నిర్వహకులు పాల్గొన్నారు.